కళ్ళు మూసుకున్నాను తన్మయత్వంతో....

కళ్ళు తెరిచేసరికి అల్లుడు, కూతురూ నా పాదాలమీదికి వంగుతున్నారు.

చటుక్కున లేవదీశాను.


"మమ్మల్ని క్షమించండి నాన్నా.... అమ్మకీ, మీకూ ఏమాత్రం ఇష్టం వుండదని తెలిసికూడా ధైర్యం చేశాను .... ఆయన మన కులంగాదు. కానీ నేనంటే ప్రాణం ఇచ్చే వ్యక్తి. మీరు మాత్రం ఇంతకన్నా ఇంకేం కోరుకుంటారు నాన్నా...." అంది కన్నీళ్ళతో.

దగ్గరగా తీసుకున్నాను.

"నాకు చాలా సంతోషంగా వుంది తల్లీ ....పాతికేళ్ళుగా నేను చేయలేని పని ఒక్క రోజులో నీవు చేయగలిగావు....ఇప్పుడు నేను నిజమైన తండ్రి ననిపించుకున్నాను .... పదికాలాలపాటు అన్యోన్యంగా, అనుకూలంగా...."

ఆగిపోయాను. తప్పుగా దీవిస్తున్నాను. నా అల్లుడు కూడా నాలాగే.... ఊహూఁ....

"పది కాలాలపాటు సుఖంగా జీవించండి...."




# యుద్ధం



కోపకొండ సత్యానంద

అతను నడుస్తున్నాడు....

నీరసంగా, నిస్సత్తువగా.... బాధగా, భారంగా నడుస్తున్నాడు....

ఎండ మండిపోతుంది అతని కడుపులో ఆకలిలా....

చెమట కారిపోతుంది ధారలా....

దాహం వేస్తుంది .... నాలుక పిడచ కట్టుకుపోయింది....

ఆలోచనలు ఆగకుండా పరుగెడుతున్న మెదడు పగిలిపోతున్నట్టుగా ఉంది....

అతను చదువుకున్న సంస్కారవంతుడు....అందుకే పీకలదాకా మునిగిపోయినా ఇంకా ఆలోచిస్తున్నాడు....

అతను దిక్కుమాలిన మధ్య తరగతి కుటుంబీకుడు .... అందుకే అభిమానపడుతున్నాడు....

అతను నడవలేక పోతున్నాడు .... అయినా నడుస్తున్నాడు .... అందుకే ఆయాసపడుతున్నాడు....

అతను మామూలుగా లేడు .... పిచ్చివాడిలా ఉన్నాడు....చిత్తుగా ఓడిపోయిన వాడిలా ఉన్నాడు....

చదువు, వయసు ఉన్న అతను అమ్ముడవ్వలేకపోతున్నాడు .... కారణం అతనికి అభిమానం ఉంది....

వయసంటే గుర్తొచ్చింది .... అతని వయసు అతన్ని కొన్ని ఉద్యోగాలకు కనీసం అప్లికేషన్ పెట్టడానికి కూడా వీలులేనంతగా పెరిగిపోయింది....

పిచ్చి మధ్యతరగతి మనిషి కావడాన అభిమానాన్ని చంపుకోలేక పోతున్నాడు....చదువుతోపాటు సంస్కారాన్ని పెంచుకోవడం వల్ల ఆదర్శాల్ని విడువలేకపోతున్నాడు....

అతని చేతిలో నలిగిపోయిన ఫైలుంది .... అందులో చిరిగిపోతున్న సర్టిఫికేట్లున్నాయి....

ఫైల్లో సర్టిఫికేట్లు .... అవి అతని గొప్పతనానికి నిదర్శనాలు .... అతని తెలివితేటలకు తార్కాణాలు .... వాటి స్థితిగతులు మాత్రం అతని చేతగానితనాన్ని అస్పష్టంగా చూపించే పగిలిపోయిన అద్దం ముక్కలు .... అతని ఓటమికి అందమైన ప్రతిబింబాలు....

అతని కడుపులో ప్రేపులు ఆనంద

నాట్యం చేస్తూ హాహాకారాలు చేస్తున్నాయి....

'ఇలాంటి వెధవ కడుపులో ఎందుకున్నామా!' అని బావురుమని ఏడుస్తున్నాయి....

అతని మనసు మెత్తనిది.... సున్నితమైనది....

ఇంకా కరుడు కట్టలేదు .... అతని గుండె ఇంకా బండరాయిలా మారలేదు....

అందుకే అతని కళ్ళల్లోంచి నీళ్ళు వస్తున్నాయి....

ఎవరైనా చూస్తారేమోనని చేత్తో తుడిచేసుకున్నాడు....

అతనికి కన్నతల్లి ఉంది....తోబుట్టువులు కూడా ఉన్నారు....వాళ్ళ పెళ్ళిళ్ళు అతని బ్రతుక్కి పెద్ద బాధ్యతలు ....

అతన్ని 'చదువుకున్న చాతగాని వాడు' అని కొందరంటుంటారు....

అతని ఆదర్శాల నోరు నొక్కేస్తే, అతనిలోని 'మంచివాడి' పీక నొక్కేస్తే....అతను బాధ్యతలు నెరవేర్చగలిగే మగవాడవ్వగలడమో!! అలా చేస్తే 'మనిషి'ని కాకుండా పోతానేమో అని అనుకుంటాడతను....

అతని కడుపు మళ్ళీ మళ్ళీ ఆకలిని గుర్తుచేస్తుంది.... 'ఏదో చేసి ఓ ముద్ద మా ముఖాన పడేయరా ముండాకొడకా!' అని తిడుతున్నాయి ప్రేవులు....

అతనికి మళ్ళీ ఏడుపు వచ్చింది....

అతను బావురుమని ఏడవలేదు .... బాధను బిగబెట్టుకున్నాడు....

కన్నీళ్ళు కళ్ళల్లోంచి నిశ్శబ్దంగా జారిపోయాయి....

మళ్ళీ ఎవరైనా చూస్తారేమోనని కళ్ళు తుడుచుకున్నాడు రెండు చేతుల్తో....

కాని, ఆ చేతులు చచ్చు చేతులు .... చేతగాని చేతులు .... బలహీనమైన చేతులు .... ఒడిలిపోయిన గోంగూర కాడల్లాంటి చేతులు .... అవేపనీ చేయలేవు....

సారీ! ఆ చేతులు కొన్ని పనుల్ని చేయగలవు.... తెలుగు, ఇంగ్లీషు, హిందీ అక్షరాల్ని ఎంతో అందంగా వ్రాయగలవు....ఈ దేశ ఆర్థిక అసమానతల్ని, రాజకీయ పరిస్థితుల్ని ఎంతో చక్కగా వ్రాయగలవు....ఏ ప్రశ్నకైనా విపులంగా జవాబు చెప్పగలవు .... అందుకే ఓ యూనివర్సిటీ అతనికి డిగ్రీమీద డిగ్రీ ఇచ్చింది....ఆ సారి ఆ డిగ్రీలను చదివిన వారందరికంటే ఇతను బాగా చదివాడని సత్కరించింది గోల్డ్ మెడల్‌తో .... ! (అదెప్పుడో ఆకలి కడుపులకి ఆహారం అయిపోయింది లెండి!) అతనంత చక్కగా, అందంగా, స్పీడుగా ఎవ్వరూ టైపు చేయలేరు, షార్ట్‌హాండ్ వ్రాయలేరు....

అంతేకాదు! అతను కవి కూడా! ఎందుకంటే అప్పుడప్పుడూ కవిత్వాలు కూడా వ్రాస్తుంటాడు....కాకపోతే అతని



కళ్ళల్లో లాగ అతని కవిత్వంలో కూడా కన్నీళ్ళే మరి!

అత నెప్పుడూ ఏ అమ్మాయినీ ప్రేమించలేదు....ప్రేయసిగా ఊహించుకోనైనా ఊహించుకోలేదు .... అలా ఊహించుకున్నా బావుణ్ను.... ఆ ఊహల్లోంచి ఓ వింత ప్రేమకథను సృష్టించి, ఆ కథకు....సారీ, ఆ (వెయ్యి పేజీల) నవలకు "రెక్కలొచ్చిన ప్రేమపక్షులు" అని పేరుపెట్టి, ఆ నవల వ్రాసింది తనైనా, తనకో అందమైన,గంభీరమైన, గౌరవమైన (ఆడ)పేరును పెట్టుకొని అలాంటి వాటికోసం కాసుక్కూర్చునే పాఠకులమీదకు విసిరేవాడు.... ఎంతో కొంతైనా సంపాదించుకోగలిగేవాడు....

అతనికి అంత చాతనైతే ఇంకేం? అతనికంత గొప్ప 'అర్ధ' లేదు....

అతని కేదీ చాతకాదు .... ధర్మం, న్యాయం, అదర్మం .... వాటితో వచ్చే ఉద్యోగం అనే కలలో విహరించడం తప్ప!

నడుస్తున్న అతని కాళ్ళు అక్కడ ఆగిపోయాయి .... అలసిపోయి ఆగిపోయాయి....

అది ఒక బస్టాపు....

ఆ ప్రదేశంలో అతను తప్ప ఇంకెవ్వరూ లేరు.... ఎందుకంటే అది పెద్ద పెద్ద ఉద్యోగస్తులున్న కాలనీ బస్టాపు.... ఈ సమయంలో ఆ ఆఫీసర్లు ఆఫీసుల్లోని ఫాన్లు క్రింద (నిద్రతీస్తూ) పనిచేస్తూ ఉంటారు....

ఎంత పని? పీతైనంత కొంచెం....!

అవును మరి....పని చేస్తాను మొర్రో అన్నవాడికి ఉద్యోగం ఉండదు, ఉద్యోగం ఉన్నవాడికి పని చేయాలని ఉండదు....

ఇది మన దేశ ధర్మం ! (ఎక్సెప్షన్స్ ఆర్ కామన్ !)

'చాతగాని యెదవకి కడుపెందుకు? కడుపులో మమ్మలుంచుకోవడం ఎందుకు?' ప్రేవులు కూనిరాగం తీసాయి....

అతను కడుపుని తడుముకున్నాడు.... అది అక్కడే ఉంది .... కానీ ఎత్తుగా లేదు....

అసలెందుకెత్తుగా ఉంటుంది? అతనేమన్నా తేర తిండి తింటున్న మనిషా? లేకపోతే ఏదైనా శాఖకు సంతకం పెట్టడం రాని మంత్రా? (ఇక్కడ కూడా ఎక్సెప్షన్స్ ఆర్ కామన్ !)

ఆ బస్టాపు దగ్గర ప్రయాణీకులు విశ్రాంతి తీసుకొనేందుకు చిన్న షెల్టరు ఉంది....చాలా షెల్టర్లకు విరుద్ధంగా అది శుభ్రంగానే ఉంది .... నీడగా కూడా ఉంది .... కడుపు చల్లబడకపోయినా, కాస్త సేద తీరుతుందేమోనని ఆ నీడలోకి వెళ్ళి నిల్చున్నాడు....

నిల్చొని, అతనేమీ చేయడంలేదు.... ఏదో పరధ్యాన్నంగా ఉన్నాడు....

ఆకాశంలోకి, ఆ చుట్టుప్రక్కల ప్రదేశాల వైపుకి అదోలా చూస్తూ కాల క్షేపం చేస్తున్నాడు....

ఏదో పనిచేయడానికి ఎంత ప్రయత్నించినా అతనికే పనీ దొరకలేదు .... అటుతే మెదడు ఆలోచనల వేడికి ముద్దైపోయి పనిచేయడం మానేసింది.... మనసు పిచ్చిదానిలా అయిపోయింది.... అయినా అతని మెదడు, మనసు విచక్షణను మరచిపోలేదు (పాపం!) కొంతసేపు అవి, ఇవీ చూసిన తర్వాత అతను కొంచెం ముందుకువచ్చి కాళ్ళను ముందుకు చాపి, చేతుల్ని వెనక్కి పెట్టి 'హమ్మయ్య' అని కూర్చున్నాడు....

సరిగ్గా అప్పుడే .... అతని కళ్ళకు కన్పించింది ఇందాకట్నుంచీ అక్కడే పడిఉన్న ఓ పచ్చనోటు....

ఆశ్చర్యం!!!

డబ్బు ఉరఫ్ ధనలక్ష్మి నేలమీద కన్పించడమా?

అది అయిదు రూపాయల నోటు.... రెండు మడతలు పెట్టబడి ఉంది .... అది పడి ఉంది, ఎటూ వెళ్ళలేక రెపరెప లాడుతూ చిన్నగా, బరువుగా కదులుతుంది.

ఆ నోటు కదలికలకు అనుగుణంగా అతనిగుండె కొట్టుకోవడం మొదలు పెట్టింది....అలా గుండె కొట్టుకోవడానికి కారణం భయంకాదు....అనుమానం.... అనుకోకుండా కలిగిన కొద్ది ఆతృత...

అంతవరకూ ఒక మాదిరిగా ఉన్న ఆలోచనలు ఆ నోటు కన్పించిన క్షణం నుండీ ఒక్కసారిగా విజృంభించాయి....

ఆ విజృంభణలో ఆదర్శాలు, ప్రేవుల ఆకలి ఆక్రందనలు దెబ్బలాడుకుంటున్నాయి- ఒకదాన్నొకటి ఓడించుకోడానికి ప్రయత్నిస్తూ యుద్ధాన్ని చేస్తున్నాయి....

ఇదిగో నా మనిషీ! ప్రాణంపోయినా మమ్మల్ని మరచిపోకు .... ఆ నోటు ఎవరిదో, ఏమిటో కాసేపు నిరీక్షించి, వాళ్ళకోసం వేచి యుండి, వీలైతే ఇంటింటికీ తిరిగి అడిగి మరీ వాళ్ళకిచ్చేయ్! .... ఇవి ఆదర్శాలు అన్న మాటలు....

వెర్రివాడా! నీకు పిచ్చికూడా పట్టిందా! నువ్వానోటును ఇచ్చేయడానికని బయలుదేరి 'ఇది మీ నోటా?' అని సంస్కారంగా అడిగితే.... నువ్వడిగిన మొదటి వాడే ఆ నోటు 'నాది' అని అంటాడు.... ఇదే తమాషా ఈ సమాజంలో .... అని ప్రేవులు వ్యంగంగా అన్నాయి....

అవి ఆకలి ప్రేవులు .... వాటికి విచక్షణా జ్ఞానం, సంస్కారం అసలుండవు .... ముందు మా మాట విని ఆ నోటును ముట్టుకో .... ముట్టుకున్నా జేబులో వేసుకోకు .... ఎవరివో అడిగి మర్యాదగా ఇచ్చేయ్!

హుం.... సంస్కారం, మర్యాద.... ఏది సంస్కారం? ఏది మర్యాద?





దొరికింది తీసుకోకపోవడం సంస్కారమా? ఎవరివో అడిగి మరీ ఇచ్చేయ్యకపోవడం అమర్యాదా? అసలవి ఎక్కడున్నాయి నాయనా? దొరికింది తీసుకొని అనుభవించడమే మర్యాద....అదే సంస్కారం! నువ్వేమన్నా దోచేసుకుంటున్నావా, నీకు సభ్యతా సంస్కారాలు లేకపోవడానికి?

వాటి మాట వినకు....తిండి గురించి అవి అలాగే అంటాయి .... కలకాలం నిలిచిపోయేది తిండి కాదు.... మేమే!

అవును! కలకాలం ఆదర్శాలే నిలిచిపోతాయి.... కానీ, ఇది కలికాలం.... అధర్మం ఆనందనాట్యం చేస్తున్న కాలం! నువ్వు మాత్రం పోతావ్ మాకు తిండి

పెట్టకపోతే.... నువ్వేమీ పదవులకోసం అన్యాయం చేయడంలేదుగా! మనిషికి కనీసం కావాల్సిన తిండికోసం తాపత్రయ పడుతున్నావ్! ఆ తాపత్రయంలో తప్పు లేదుగా.... అసలిది అన్యాయం కాదు.... దొరికింది కాబట్టి తీసుకుంటున్నావ్.... ఆ నోటును తియ్యకపోవడం వల్ల నీ ఆదర్శాన్ని, గొప్ప నిజాయితీని ఈలోకం గుర్తించదు.... ఈ లోకం గుర్తించేది గూండాల్నే! దేశాన్ని దోచుకునే దొంగల్నే మహానుభావు లంటుంది.... అందలాన్ని ఎక్కిస్తుంది....

అలా జరుగుతుంది ఆ యుద్ధం....!

ఆ యుద్ధానికి అతను తట్టుకోలేక పోతున్నాడు.... ప్రేవుల ఆకలి అరుపులే అతనికి వినిపిస్తున్నాయి.... అందుకే అతనికి నీరసం వస్తుంది.... ఆ నీరసమే అతన్ని ఓ నిర్ణయానికి దగ్గిర త్రోవలో తీసుకెళ్తుంది....

ఆ మరుక్షణంనుండీ ఆకలి ఆనందంగా అతన్ని పొగడడం మొదలు పెట్టింది.... మా మాట వినినందుకు 'చాలా థాంక్స్ గురో!' అని ప్రేవులు అతనికి కృతజ్ఞతలు చెప్తున్నాయి....

ఆదర్శాలు చేస్తున్న గోల అతనికి వినిపించనీయడం లేదు, ప్రేవులు....

ఏర్పడిన నిర్ధారణ అతనికి ఓపిక నిచ్చింది....

ఆ నోటు అతనికి జేబులోకి వెళ్ళి పోయింది....

ఆదర్శాలు (నిజంగా దేశసేవ చేద్దామని ఎలక్షన్లో నిల్చొని ఓడిపోయిన అభ్యర్థుల్లా) తెల్లముఖాలు వేసాయి....

అతను మళ్ళీ నడవడం మొదలు పెట్టాడు....

జోరుగా నడవడం మొదలుపెట్టాడు..

ఆదర్శాలు విస్తుబోయి నిశ్శబ్దంగా ఉండిపోయాయి....

ప్రేవులు తమ ఆకలి తీరబోతోందని ఆనందంగా డిస్కో నృత్యం చేస్తూ ఆ అయిదు రూపాయలకూ తినడానికి ఏమేమి వస్తాయా అని లెక్కలు కడుతున్నాయి...

అంతలో

"బాబూ!"

వణుకుతున్న ఓ వృద్ధ కంఠం వినిపించింది....

అతను ఆగాడు.... ఆగి వెనక్కి తిరిగి చూసాడు....

ఓ యాభై ఏళ్ళ ముసలాడు.... చిరిగిపోయిన బట్టలు తొడుక్కున్నాడు .... గెడ్డం బాగా పెరిగిపోయిఉంది.... ముఖమంతా చెమటపట్టి ఉంది.... నీరసంగా, నిస్సత్తువగా, బెంగగా, భయంగా ఉన్నాడు.

"ఏం కావాలి!" నీరసంగా. అసహనంగా, అనుమానంగా అడిగాడు....

ఆ ముసలాడు భయంగా, బరువుగా, ఆశగా నోరు కదిపాడు....

"బాబూ! మీ కిక్కడెక్కడైనా ఐదు రూపాయల నోటు దొరికిందా!"

ఎందుకో అప్రయత్నంగా అతని గుండె దడదడలాడడం మొదలు పెట్టింది.... అతని ఆలోచనలు ఆగిపోయాయి.....

ప్రేవులు కంగారుపడ్డాయి....

ఆదర్శాలు చెవులు రిక్కించి, పొంచి చూస్తున్నాయి....

ఆ ముసలాడి ఉద్దేశం - దొరికిన నోటును ఎవ్వరూ తీసుకోకుండా ఉండరు. అడిగితే, ఈలోకంలో ఇంకా అక్కడక్కడా ఉన్న మంచివారు అడిగిన వెంటనే ఇచ్చేస్తారు.... తన అదృష్టం బాగుంటే ఈ అబ్బాయే ఆ మంచివాడవ్వచ్చుగదా - అని!

"ఆఁ.... అయిదు రూపాయలనోటా? ....అ...." అత నింకా ఏదో చెప్పబోయాడు....

ప్రేవులు సర్దుకున్నాయి త్వరగా....

చెప్పకు... నీకు ఆ నోటు దొరికిందని చెప్పకు!

ఇంకా ఆదర్శాలు నోరుమూసుకొని ఉండలేకపోయాయి.

లేదు నువ్వు ఆ నోటు దొరికిందని చెప్పేయాలి.... ఇందాక మా మాట వినలేదు. ఈసారి మా మాట విను.... మనసున్న, అందులో సంస్కారం నిండి ఉన్న నిండు మనిషిగా ప్రవర్తించు. ఆ నోటు అతని కిచ్చేయ్!

వద్దు! ఇవ్వకు!!

నో! నివ్వు ఇవ్వాలి!!

ఇవ్వకు!

ఇచ్చెయ్!

ఇవ్వకంటే ఇవ్వకు!

ప్రాణం పోయినా ఇవ్వడం మానకు!

చచ్చినా ఇవ్వకు!

చచ్చినా ఫర్వాలేదు! ఇవ్వకు!!

మళ్ళీ యుద్ధం....! సంఘర్షణ!

ఆదర్శాలు ఊరుకోలేదు.... ప్రేవుల పీకలమీద అడుగేసి మరీ నిలబడ్డాయి....

ఇన్నాళ్ళూ నువ్వు మా మాటను జవదాటలేదు.... ఇన్నాళ్ళూ - అసలైన మనిషిగానే బ్రతికావు.... ఈ రోజు నువ్వు మనిషిగా చచ్చిపోకు.... ఈ చిన్న విషయంలో నువ్వు స్వార్థంతో, పిచ్చి ఆకలి అరుపునకు భయపడి తప్పుదారి పట్టకు....

ఇంకా ఏవేవో అలా చెప్తూనేఉన్నాయి ఆదర్శాలు....

అతని మెదడు ఆలోచించడంమొదలు పెట్టింది....

గొంతు పెగలక ప్రేవులు గింజుకుంటున్నాయి.... అతన్ని ఆపాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయి....

ఆదర్శాలు మాత్రం ఆగలేదు.... అతన్నింక మరో విధంగా ఆలోచించనివ్వకుండా తమ మంత్రాల్ని వల్లిస్తూనే ఉన్నాయి.

ముసలాడు ఏదో చెప్తున్నాడు....

"....నేనీ కోట్రస్సుల్లో పెద్దోళ్ళ దగ్గర పనిచేస్తున్నాను బాబూ! అదిగో,

ఆ ఆఫీసు మేనేజరుబాబు బేందీసీసా తెమ్మని నాకు డబ్బులిచ్చి పంపించేరు - బేందీసీసా కొనుక్కొనెళ్ళి మిగిల్న అయిదు రూపాయిలూ తిరిగిచ్చేద్దామని సూస్కుంటే అదెక్కడా లేదు బాబూ! బేందీకొట్టాడు ఇయ్యలేదనుకుంటే ఆడు ఇచ్చినట్టుగా నాకు బాగా గుర్తున్నాది.... ఇంకేటి అడ్ని అడుగుతాను! బేటికి కన్నం కూడానేదు.... చేత్తోపట్టుకొని నడుస్తావుంటే జారిపోయుంటాదనుకొని ఇలా ఎతుక్కుంటూ వత్తన్నానుబాబూ! అంతలో మీరు కన్పించేరు.... మీగ్గానీ ఎక్కడైనా....అహఁ.... మరోలాగ అనుకోకు బాబూ! నోటు కనబడక నేను కంగారు పడతాఉంటే ఆ బాబుగోరు కళ్ళెర్రజేసి, 'ఆనోటు తెచ్చిచ్చేక మరీ నాకు కన్పించు, దొంగనాకొడకా!' అని తిట్టేరు బాబూ! నే ఆనోటు దైవ పెమానకంగా దోచుకోలేదు బాబూ! నేనుదొంగోడ్ని కాదు బాబూ! అది తిరిగి ఇవ్వాపోతే నాకింక ఎవరింట్లోనూ పనిఉండదు బాబూ ........ పని లేకపోతే...." ఏడుపు పర్యంతం అయ్యాడు ఆ ముసలాడు....

దైన్యంగా ఉన్నాయి అతని మాటలు....

ఆలకించావా! అతను ఓ కూలివాడు.... పెద్దవాళ్ళ ఇళ్ళల్లో పనిచేసి బ్రతికే కూలివాడు.... వాడిమీద అభిమానం గానీ, నమ్మకంగానీ ఎవరికీ, ముఖ్యంగా వాడు పనిచేసే ఇళ్ళల్లో వాళ్ళకు ఉండవు.... వాడంటే ఆ అందరికీ అనుమానమే! అందుకే ఆనోటు నాకిప్పుడే దొరికిందని చెప్పి ఇచ్చెయ్! వాడు సంతోషిస్తాడు.... వాడు ఆనందంగా చెప్పుకునే కృతజ్ఞతలే నీకు శ్రీరామరక్ష! ఇచ్చెయ్! (అతని ఆదర్శాలు అస్థిత్వాన్ని నమ్ముతాయి.)

ఇచ్చెయ్! ఇచ్చెయ్ !!!

ఇచ్చెయ్ !!! ఇచ్చెయ్ !!!

ఎంత ప్రయత్నించినా ప్రేవులు మాట్లాడలేకపోతున్నాయ్... జరుగుతున్న దాన్ని ఆపలేకపోతున్నాయ్ .... అని ఊరికే గింజుకుంటున్నాయి తప్ప ఏమీ చెప్పలేకపోతున్నాయి.

అతనొక నిశ్చయాన్ని కొచ్చేసాడు....

"అయిదు రూపాయల నోటేకదూ! ? నాకిప్పుడే, అదిగో, అక్కడదొరికింది... ఇంద ...., అంటూ జేబులో చేయి పెట్టాడు....

అంతే!

అతని గుండె గతుక్కుమన్నది....

ఓ రెండు వ్రేళ్ళు అతని జేబు నున్న రంధ్రంలోంచి బయటకు వచ్చి ఆ ముసలాడ్ని వెక్కిరించాయి.

ఇందాకటి వరకూ అతనిలో జరిగిన యుద్ధంలోని ఇరుపక్షాలూ ఊసురోమన్నాయి.

### సీరియల్

# సౌందర్యదీపం

## ఆర్. సంధ్యాదేవి

(గత సంచిక తరువాయి)

మర్నాడు మధ్యాహ్నం పన్నెండున్నర ఒంటిగంట టైము అయింది. అంబిక హాస్పటల్ నుండి భోజనానికి యింటకి వచ్చేసింది.

నౌకరు ఫోన్ రింగయితే వెళ్లి రిసీవర్ ఎత్తి ఫోన్ ఇంద్రమ్మకు అని వెళ్లి ఆమెను పిల్చుకు వచ్చాడు.

ఎవరా అనుకుంటూ వెళ్లి రిసీవర్ అందుకుంటూ "హల్లో" అంది ఇంద్రసేన.

"ఆహా నీ కంఠస్వరమేనా! ఎంత తియ్యగా ఉంది" అంది అవతలి కంఠస్వరం. ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి ఎవరా అన్నట్టు.

"మాట్లాడవేమి పంచవన్నెల రామచిలుకా! అలుకా? మరి అలా చూడకే మొలకా! మరి మురిపించికా కవ్వించక! ఆగలేనిక చెంతకు రావేమిక! గుండెల్లో ఒదిగిపోవేమిక! రెచ్చగొట్టకిక" అవతలి కంఠస్వరం ఇంకా ఇంకా ఏదో అంటూనే ఉంది.

"యు...."

"ప్చ్! ఎంత చక్కని పలుకో .... ఎంత ముద్దు వస్తున్నావు" అంది అవతలి కంఠస్వరం. ఆమెను ఇంకా రెచ్చగొట్టటానికి కన్నట్టు.

టక్కున రిసీవర్ పెట్టేసి గిరుక్కున వెనుదిరిగింది. రెండు అడుగులు ముందుకివేసి వెళ్తుంటే మళ్లీ ఫోన్ రింగయింది.

అడుగు ముందుకు వెయ్యబోయి ఆగిపోయింది, రిసీవర్ తియ్యాలా వద్దా అన్నట్టు.